క్లుప్తంగా

1 నుంచి యోగా శిబిరం

కడప కల్చరల్ : కడప పటేల్ రోడ్డులోని మిత్ర యోగా కేంద్రంలో ఆగస్టు 1 నుంచి యోగ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు డాక్టర్ కె.కల్పన, డాక్టర్ కె.రంగనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రోగ నిరోధకశక్తిని పెంచుకునేందుకు మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు, అధిక బీపీ, డయాబెటీస్, ఒబెసిటీ లాంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం తదితర యోగా ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామన్నారు. రోజు ఉదయం 5.30 నుంచి 7.00 గంటల వరకు, 9.00 నుంచి 10.30 గంటల వరకు మహిళల కోసం ప్రత్యేక బ్యాచ్‌గా తరగతులు నిర్వహిస్తామన్నారు. స్త్రీ, పురుషులకు ప్రత్యేకంగా తరగతులు ఉంటాయన్నారు. వివరాలకు 98488 61206, 70132 38986 నెంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

కడప కల్చరల్ : కడప నగరం ఆరోగ్యమాత చర్చిలో శనివారం గ్రాండ్ పేరెంట్స్‌డేని ఘనంగా నిర్వహించారు. చర్చి డైరెక్టర్ ఫాదర్ ప్రసాద్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించడం మన సంప్రదాయమని అన్నారు. సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డల కోసమే పూర్తి స్థాయిలో త్యాగాలు చేస్తారని, వారిని పిల్లలు అలక్ష్యం చేయవద్దన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



హోమియోపతి ఆస్పత్రి ఎదుట చెట్ల కొమ్మలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

కడప రూరల్ : కడప నగరం పాత రిమ్స్ ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రి ఎదుట కరెంటు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. అక్కడ ఉన్న ఒక చెట్టు కొమ్మలు కరెంటు తీగపై ఉన్నాయి. వర్షాకాలం కాబట్టి గాలి, వానకు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉంది. ఇక్కడ ఆస్పత్రికి వచ్చే వారితోపాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదం జరగకముందే కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులకు 'బాసట' వితరణ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ శనివారం అర్హులకు వితరణ కార్యక్రమాలను నిర్వహించింది. ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలోని ఓ నిరుపేద కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసింది. అక్కడి వృద్ధాశ్రమంలో బాసట సభ్యులు డీపీ కార్తీక్‌రెడ్డి బంధువు అర్జున్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. అనంతరం నగరంలోని రిమ్స్‌లో సంస్థ ఫుడ్ టీం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నగర వాసి కాకర్ల చెన్నారెడ్డి సతీమణి విజయమ్మ జ్ఞాపకార్థం రిమ్స్‌లోని రోగుల సహాయకులకు, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేరువ బాలాజీరావు, సభ్యులు మునగపాటి రఘుబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ పాత్రికేయుడు లియాఖత్ అలీఖాన్ మృతి



లియాఖత్ అలీఖాన్ (ఫైల్)

కడప కల్చరల్ : జిల్లాలో దాదాపు 30 ఏళ్లుగా ప్రముఖ దిన పత్రికల్లో పాత్రికేయుడిగా సేవలందించిన లియాఖత్ అలీఖాన్ (55) శనివారం మృతి చెందారు. 1996 ప్రాంతంలో ఆంధ్రజ్యోతిలో పాత్రికేయుడిగా చేరిన ఆయన కొన్నేళ్లపాటు అందులో పనిచేశారు. ఆ తర్వాత ఆంధ్రభూమి, సూర్య, ఆంధ్రప్రభ పత్రికల్లో పని చేశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం మృతి చెందారు. లియాఖత్ అలీఖాన్ సతీమణి ఉద్యోగిగా పనిచేస్తుండగా, ఇద్దరు సంతానం ఉన్నారు.

ఆర్టీపీపీలో కొనసాగుతున్న నిరసనలు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రీజనల్ అధ్యక్షుడు మల్లేశుడు, తదితరులు పాల్గొన్నారు.

2న ఆలయ భూముల వేలం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న శ్రీ మాధవ-ఆంజనేయ, శ్రీ ఈశ్వర-వీరభద్ర దేవాలయాలకు సంబంధించిన భూముల వేలాన్ని వచ్చే నెల 2వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రాచార్యులు తెలిపారు. మొత్తం 59 ఎకరాలు రెండు సంవత్సరాలకు కౌలుకు దేవాలయ ప్రాంగణంలో వేలం వేయబడునని తెలిపారు. ఇప్పటికే పలు కారణాలతో మూడు సార్లు ఆలయ భూముల వేలం వాయిదా పడటంతో నాలుగవ సారైనా అధికారులు వేలం నిర్వహిస్తారో లేదో అని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

ఆరోగ్యఫలం జామ

- రోజుకొకటితింటే సంపూర్ణ ఆరోగ్యం
- మార్కెట్‌లో ఎటుచూసినా కనిపిస్తున్న పండు



విక్రయానికి సిద్ధంగా జామకాయలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మార్కెట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా తాజా జామకాయలే కనిపిస్తున్నాయి. సామాన్యులు మొదలుకొని సంపన్నుల వరకు జామను ప్రతి ఒక్కరూ ఇష్టంగా తీసుకుంటారు. సామాన్య మధ్యతరగతి కుటుంబానికి పసందైన పండు జామ. ప్రస్తుతం మార్కెట్‌లో నాటు రకాలకు చెందిన జామపండ్లు లభ్యమవుతున్నాయి. కిలో రూ. 50–60 వరకు విక్రయిస్తున్నారు. హైబ్రీడ్ రకాలతో పోలిస్తే నాటుజామలో పోషకాలు అధికంగా ఉంటాయి.

జామతో లాభాలు

జామపండుతో అనేక వ్యాధులు దూరమవుతాయి. రోజూ తినడం ద్వారా శరీరంలోని కొలెస్ట్రాల్ తగ్గి ప్రొటీన్లు పెరుగుతాయి. జామలో కొవ్వు క్యాలరీలు తక్కువగా ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇదెంతో ఉపయోగకరమైనది. జామకాయలో పోషకాలు, విటమిన్లు, పీచు పదార్థాలు వంటి గుణాలు ఉండటం వల్ల చక్కెర వ్యాధిగ్రస్తులు కూడా వీటిని తినొచ్చు. జామపండులో 21 శాతం విటమిన్–ఏ ఉంటుంది. ఇది చర్మాన్ని ప్రకాశవంతంగా ఉంచుతుంది. శ్లేష పొరలను నివారించేందుకు సహాయపడుతుంది. ఈ పండులో 20 శాతం పోలేట్ ఉండడంతో స్త్రీల నెలసరి సమస్యల పరిష్కారానికి బాగా పనిచేస్తుంది. పింక్ కలర్ జామపండులో ఉండే లైకోఫిన్ అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఇది ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నివారిస్తుంది. జామలో పొటాషియం శాతం ఎక్కువగా ఉండడంతో రక్తపోటును కూడా నివారిస్తుంది. నారింజ కంటే జామపండులో విటమిన్–సి ఎక్కువగా ఉంటుంది. కాస్త పండిన జామలో లైకోఫిన్ పోషకం ఉండడంతో మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్నందువల్లే జామను పేదవాడి ఆపిల్‌గా పిలుస్తారు. రోజుకొక జామ కాయ తింటే ఆరోగ్యంగా ఉండొచ్చు.

జామ ఆకులతో ప్రయోజనాలు

జ్వరం, దగ్గు, జలుబు వంటి సాధారణ సమస్యలకు జామ ఆకులు బాగా పనిచేస్తాయి. జామ ఆకులను వేడి నీటిలో ఉడకబెట్టి టీ తయారు చేసి తాగొచ్చు. జామ ఆకుల్లో యాంటీ ఇన్‌ఫ్లామ్యాటరీ, యాంటీ మైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాల వల్ల జుట్టు రాలడం ఆగిపోయి వెంట్రుకలను బలోపేతం చేసేందుకు సహాయపడుతుంది.

షుగర్ వ్యాధిగ్రస్తులకు మంచిది



సీజన్‌లో లభించే జామపండు రోజుకొకటి చొప్పున తీసుకుంటే షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుంది. దోర జామపండు వగరు దంతాలను శుభ్రం చేయడంతోపాటు చిగుర్ల నుంచి రక్తస్రావాన్ని నివారిస్తుంది. ఈ పండులో విటమిన్–సి పుష్కలంగా ఉండడంతో కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. జామ ఆకులను ఎండబెట్టి, పొడిచేసి పాలు, నీళ్లలో కలుపుకొనితాగితే అతిసార, నరాల బలహీనతలను నివారించొచ్చు.

– డాక్టర్ జనార్దన్‌మూర్తి, హోమియో వైద్యులు, కడప

ఆదమరిస్తే వాహనం డ్రైనేజీలోకే



ప్రధాన రహదారి పక్కనే ప్రమాదకరస్థితిలో డ్రైనేజీ

కడప ఎడ్యుకేషన్ : కడప బస్టాండ్‌కు సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి అప్సర హాల్‌కు వెళ్లే దారిలోని ఓంశాంతినగర్‌కు సమీపంలో ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు ఆదమరిస్తే డ్రైనేజీ కాలువలో పడే ప్రమాదం పొంచి ఉంది. బస్టాండ్ సమీపం నుంచి తిరుపతి బైపాస్ రోడ్డు వరకు నగరపాలక సంస్థ రోడ్డు విస్తరణ పనులను చేస్తోంది. దీంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న అక్రమాలను తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా డ్రైనేజీ కాలువ వద్ద మట్టిని తొలగించారు. దీంతో అక్కడ ప్రమాదం పొంచి ఉంది. ఆ రోడ్డున వెళ్లే వాహనదారులు పొరపాటున రోడ్డు దిగితే డ్రైనేజీ కాలువలో పడే అవకాశం ఉంది. సంబంధిత ఆక్రమణలను తొలగిస్తున్న నగరపాలక సిబ్బంది ఆ కాలువ వద్ద హెచ్చరిక బోర్డు లేదా కాలువకు ఏదైనా అడ్డుగా పెట్టాల్సిన అవసరం ఉంది.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి



కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 31న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి కోరారు. శనివారం కలెక్టరేట్ ఎదుట చేస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జిల్లా అభివృద్ధి కోసం బ్రాహ్మణీ స్టీల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారని ఆయన మరణాంతరం వచ్చిన పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే హామీని విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న జయవర్ధన్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ హాస్టల్ విద్యార్థులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఏఐఎస్‌బీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4033 హాస్టళ్లు ఉండగా అందులో 5 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారన్నారు. సంబంధిత హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొన్ని చోట్ల విద్యార్థులకు సరైన ఆహారం అందక అర్థాకలితో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కడప జిల్లా కార్యదర్శి ఓబయ్య, వినోద్, హరి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేసే జీవోలను ఉపసహరించుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వైద్య విద్యను దూరం చేసే జీవో 107,108లను వెంటనే ఉపసహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా సీట్లను వర్గీకరణ కింద విభజించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రానికి మంజూరు చేసిన మొత్తం మెడికల్ సీట్లు 750లో జాతీయ మెడికల్ కౌన్సిలింగ్‌లో 112 సీట్లను అన్ని రాష్ట్రాల వారికి ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారని తెలిపారు. మిగిలిన 630 సీట్లలో రాష్ట్ర ప్రభుత్వ జీవోల వల్ల 319 సీట్లు సాధారణ విభాగానికి కేటాయించడం జరిగిందన్నారు. బి వర్గీకరణ కింద ప్రైవేట్ కళాశాలల్లో ఐదేళ్లకు రూ.60 లక్షలు, సీ వర్గీకరణ కింద ఐదేళ్లకు రూ. కోటి వరకు ప్రభుత్వం వసూలు చేస్తోందన్నారు.

నేటి కవులకు ఆదర్శప్రాయుడు నారాయణరెడ్డి



నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : తెలుగువారి అభిమానాన్ని దోచుకున్న జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి నేటి కవులకు, రచయితలకు ఆదర్శప్రాయుడని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాథనాయుడు వంటి గేయ కావ్యాలు, రాయప్ప వంటి రూపకాలు కవితా ప్రపంచంలో సినారెకు గౌరవస్థానాన్ని సంపాదించి పెట్టాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువులబాబు, శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి కె.మురళీమోహన్ రాజు, ఉపాధ్యాయులు డాక్టర్ ఎన్. నాగేశ్వరరావు, వై.చంద్రశేఖర్‌రెడ్డి, కుండా భాస్కర్, వారధి మధు, జి.రామిరెడ్డి, కోటా ఓబుళరెడ్డి, సూరా రెడ్డి, గంగాధర్, రమణయ్య, రామసుబ్బారెడ్డి, ఓబులేసు, సురేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో నాలుగు 4 లక్షల మందికిపైగా ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు పనిచేస్తున్నారని, వారందరినీ యుడైస్ విద్యార్థుల నమోదుతోపాటుగా నమోదు చేయాలన్నారు. కార్మిక చట్టాలను అనుసరించి టీచర్లు, లెక్చరర్లకు జీతాలు ఇవ్వాలని, అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించకూడదన్న నిబంధనలను అమలు పరచాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం అధిక శ్రావణమాస శుక్ల ఏకాదశిని పురస్కరించుకొని వేద పండితుల ఆచారత్వమున ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వార్లను మాడ వీధుల గుండా గరుడ సేవ చేశారు. అలాగే రథంపై స్వామి వార్లను ఊరేగింపు నిర్వహించారు. మహా మంగళహారతి కార్యక్రమంతో ఏకాదశి పూజలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నివాళి

కడప ఎడ్యుకేషన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సకాలంలో పెన్షన్ పొందుతూ ప్రశాంత జీవనం గడపడం వెనక ధరమ్ స్వరూప్ నరాకా కృషి ఉందని జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి రామమూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి అన్నారు. శనివారం పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో నరాకా వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలయల్లారెడ్డి, కోశాధికారి నాగేష్, సంఘ సభ్యులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సినారెను విస్మరించడం బాధాకరం

కడప కల్చరల్ : సుప్రసిద్ధ తెలుగు కవి, డాక్టర్ సి.నారాయణరెడ్డికి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం కనీస గౌరవం ఇవ్వకుండా విస్మరించడం బాధాకరమని బ్రౌన్ గ్రంథాలయం సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. సినారె రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించారని, ఈ కేంద్రం రెండవ అంతస్తు నిర్మాణానికి రూ.10 లక్షలు ఆర్థికసాయం చేశారని గుర్తు చేశారు. బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధి కోసం కృషి చేసిన ఆ మహానుభావుడి జయంతి సందర్భంగానైనా కనీసం ఆయన చిత్రపటానికి పూలమాల వేయకపోవడం శోచనీయమన్నారు.

తిరుచ్చి వాహనంపై కడపరాయుడు



మాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి శనివారం తిరుచ్చి వాహనంపై గ్రామ ప్రజలకు దర్శనమిచ్చారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు మయూరం కృష్ణమోహన్, సాయి బృందం తొలుత మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి రథంపై కొలువుదీర్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని గోవింద నామస్మరణల మధ్య దేవునికడప మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు తమ ఇళ్ల వద్దకే తరలివచ్చిన దేవతామూర్తులను దర్శించుకుని పూజా సామగ్రిని అందజేసి మొక్కుకున్నారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం



సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో శనివారం సాయంత్రం మహిళా భక్తులు సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. దాదాపు వంద మందికి పైగాగల ఈ బృందానికి ఇటీవల తిరుమల–తిరుపతి దేవస్థానాల నృత్య నీరాజనం వేదికపై ఆగస్టు 1వ తేదీ సాయంత్రం ఈ పారాయణం ఆలపించేందుకు అనుమతి లభించింది. దీంతోపాటు ఇదే బృందానికి చెందిన కళాకారులు ఆలయ మాడవీధుల్లో కోలాటం చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. ఇందుకోసం స్థానిక కళాకారులు దాదాపు రెండు నెలలపాటు విష్ణుసహస్రనామ పారాయణంతోపాటు కోలాటాన్ని కూడా అనుభవం గల గురువుల పర్యవేక్షణలో శిక్షణ పొందారు. శనివారం ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి పర్యవేక్షణలో వీరు నామ పారాయణం నిర్వహించిన అనంతరం ఆలయంలో శ్రీరాముడికి విశేష పూజలు నిర్వహించారు. వీరు సోమవారం తిరుమలలో తమ ప్రదర్శన ఇచ్చేందుకు అన్నమయ్య కాలిబాట ద్వారా వెళ్లనున్నారు.

ఆకట్టుకుంటున్న హస్త కళారూపాలు



ప్రదర్శనను తిలకిస్తున్న కొనుగోలుదారులు

కడప కల్చరల్ : కడప నగరం టీటీడీ కళ్యాణ మండపంలో శ్రీ కళాజ్యోతి హస్తకళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రదర్శనకు విశేష ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా కళాకారులు రూపొందించిన పలు హస్తకళారూపాలు నగరవాసులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. మన ప్రాంతంలో అరుదుగా కనిపించే కొండపల్లి కొయ్యబొమ్మలు, ఏటికొప్పాక కళారూపాలతోపాటు జైపూర్ పెయింటింగ్‌లు, ఉడ్ కార్వింగ్ బొమ్మలు, చూపరులను ఆశ్చర్యచకితులను చేస్తున్నాయి. ఇవి మన ప్రాంతంలో లభించవు కాబట్టి ప్రజలు వీటి పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు.

నిరసనలపై డీఈఓ ఇచ్చిన ఉత్తర్వుల ఉపసంహరణ



డీఈఓ రాఘవరెడ్డితో చర్చలు జరుపుతున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులు, విద్యార్థులు ధర్నాలు, ర్యాలీల్లో పాల్గొనకూడదని, అలా పాల్గొంటే సీసీఏ రూల్స్ కింద చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి జులై 15న జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులతో శనివారం మధ్యాహ్నం డీఈఓ రాఘవరెడ్డి చర్చలకు ఆహ్వానించారు. ఈ చర్చల్లో ఫ్యాప్టో నాయకులు పలు అంశాలను డీఈఓ దృష్టికి తెచ్చారు. దీంతో డీఈఓ ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లు తెలపడంతో వివాదం ముగిసింది. చర్చల్లో ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ్‌కుమార్ ఇటీవల బదిలీల్లో, పదోన్నతుల్లో జరిగిన కొన్ని అవకతవకలను డీఈఓ దృష్టికి తీసుకురాగా, వాటిని విచారించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నష్టపోయి ఉంటే వారికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. డీఈఓ ఉపాధ్యాయులను దుర్భాషలాడుతున్న విషయాన్ని ప్రస్తావించగా.. విద్యాశాఖను గాడిలో పెట్టాలనే అక్కడక్కడా కఠినంగా మాట్లాడానే తప్ప ఉపాధ్యాయులను కించపరచాలనే ఉద్దేశ్యం తమకు లేదన్నారని తెలిపారు. భవిష్యత్తులో స్నేహ పూరిత వాతావరణంలో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నట్లు చెప్పారు. చర్చలు జరిగి సమస్యల పరిష్కారానికి డీఈఓ హామీ ఇవ్వడంతో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 6న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విరమించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్ వెంకటసుబ్బయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరెడ్డి, హెచ్‌ఎం సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీటీఏ జిల్లా అధ్యక్షుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడకు పూర్వవైభవం తెస్తాం



హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధిపై చర్చిస్తున్న సంఘం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : హ్యాండ్‌బాల్ క్రీడకు జిల్లా వ్యాప్తంగా పూర్వ వైభవం తీసుకువస్తామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని పాత కలెక్టరేట్‌లో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ముఖ్యప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి, మండలస్థాయిలో క్రీడాభివృద్ధికి అవసరమైన మెటీరియల్ అందిస్తామన్నారు.జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ముఖ్యసలహాదారు రేణుకాభిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ సీనియర్ క్రీడాకారులు శివప్రసాద్, అబ్దుల్ మునాఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపాల్‌రెడ్డి, ఎస్. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం కమలాపురం వార్డు–1 సచివాలయం పరిధిలోని 15వ మున్సిపల్ వార్డు పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, విద్యుత్ స్తంభాలు కావాలని వినతులు అందడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. మీ సమస్యలు తెలుసుకోవడానికే, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం కోసమే జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని సీఎం జగనన్న ప్రారంభించారన్నారు. ఏపీ సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా మారిందన్నారు. ఇక్కడ అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. పింఛన్ రూ.2750 దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. జనవరి నెల నుంచి అది రూ.3 వేలకు పెరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు వేల కొద్ది దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని ఒక్కటి నెరవేర్చలేదన్నారు. బాబు తన పాలనంతా అవినీతికి కేరాఫ్‌గా మారిందన్నారు. జన్మభూమి కమిటీలు లంచాలు, కమీషన్లు ఇచ్చిన వారికే అరకొర పథకాలు ఇచ్చారన్నారు. వ్యవసాయ రుణాలన్నీ మాఫీ చేస్తానని జగనన్న ఒక్క దొంగ హామీ ఇచ్చి ఉంటే 2014లోనే సీఎం అయ్యేవారన్నారు. కార్యక్రమంలో నాయకులు సీఎస్ నారాయణరెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఖాజాపీర్, గఫార్, హిదాయత్, ఇర్ఫాన్, ఖాజా హుసేన్, మోహన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, వంశీధర్ రెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, మస్తానయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, టీవీ సుబ్బరాయుడు, నిఖిల్‌రెడ్డి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు : జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మార్కెట్ యార్డు నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పడితే 50వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాలో ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని అన్నారు. ఈనెల 25న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కాదని చెప్పడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌పై, రాష్ట్ర విభజన హామీలపై టీడీపీ, జనసేన, వైఎస్సార్‌సీపీ పార్టీలు నోరు మెదపడం లేదన్నారు. ఈ మూడు పార్టీలు బీజేపీకి మద్దతు ఇస్తున్నాయన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు విజయకుమార్, బాలసుబ్బయ్య, ఓబులేసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.